క్లుప్తంగా

బస్ షెల్టర్ నిర్మాణానికి సహకరించాలని వినతి



తిరుపతి ఎంపీ గురుమూర్తిని కలిసిన కర్లపూడి మాజీ సర్పంచ్ చెంచురాఘవరెడ్డి

కోట: మండలంలోని కర్లపూడిలో బస్ షెల్టర్ నిర్మాణానికి సహకరించాలని మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నాయకుడు సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి కోరారు. ఆయన బుధవారం తిరుపతి ఎంపీ గురుమూర్తిని తిరుపతిలో కలిసి వినతి పత్రం అందజేశారు. బస్ షెల్టర్ లేకపోవడంతో గిరిజన కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

అభివృద్ధికి ప్రణాళికలు

ఓజిలి: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా గ్రామ పంచాయతీలు అభివృద్ధికి ప్రణాళికలు తయారుచేయాలని ఎంపీడీవో విజయలక్ష్మి తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఎంపీపీ గడ్డం అరుణారెడ్డి అధ్యక్షతన జీపీడీపీ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా సంఘ బంధం, పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలకు రిసోర్స్‌పర్సన్లు రేణుక, అనీల్, వెంకటేష్ బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో మాట్లాడుతూ 2025–26 సంవత్సరంలో పంచాయతీల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తోందని పేర్కొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

గూడూరు రూరల్: రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సీనియర్ డివిజన్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు ఆదేశించారు. ఆయన బుధవారం గూడూరు రైల్వే స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్లాట్ ఫారాలు, ప్రయాణికుల విశ్రాంతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ఆహార స్టాళ్లలో నాణ్యత, ధరల పట్టిక, విక్రయాలకు ఉన్న తేడాపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. టికెట్ కౌంటర్లలో డిజిటల్ లావాదేవీలు పెంచాలని ఆదేశించారు.

సర్పంచుకు సమాచారం ఇవ్వకుండానే గ్రామసభ

నాయుడుపేట టౌన్: కారుమంచివారికండ్రిగలో బుధవారం రెవెన్యూ సిబ్బంది తనకు సమాచారం ఇవ్వకుండానే గ్రామసభ నిర్వహించడంపై సర్పంచు రమణయ్య అగ్రహం వ్యక్తం చేశారు. వీఆర్వో భక్తవత్సలంను నిలదీశారు. తహసీల్దారు రాజేంద్ర మాట్లాడుతూ సర్పంచులు, వార్డు సభ్యుల సమక్షంలో గ్రామసభలను నిర్వహించాలని రెవెన్యూ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామన్నారు. కారుమంచివారి కండ్రిగ సర్పంచుకు సమాచారం ఇవ్వకపోవడంపై విచారణ చేస్తామన్నారు.

- విద్యతోపాటు కళలు, క్రీడల్లోనూ రాణింపు
- స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న చిన్నారులు

నేటి బాలలే రేపటి పౌరులు.. సమసమాజ నిర్దేశకులు.. దేశాభివృద్ధికి కారకులు.. వారిలోని సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తే అన్ని రంగాల్లోనూ రాణిస్తారు. అద్భుతాలు సృష్టిస్తారు. మంచి పౌరులుగా ఎదగడంతోపాటు దేశ కీర్తి కిరీటాన్ని ఎగురవేస్తారు. మన దేశ మొదటి ప్రధాని నెహ్రూ పిల్లల విద్యకు పెద్ద పీట వేశారు. అందువల్లే ఆయన జయంతిని బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ నేపథ్యంలోనే చిల్లకూరు, వాకాడు, సైదాపురం మండలాలకు చెందిన కొంతమంది విద్యార్థులు విద్యతో పాటు వివిధ రంగాల్లో రాణిస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. – చిల్లకూరు/వాకాడు/సైదాపురం

చరిత్ గురిపెడితే లక్ష్య ఛేదనే..



బాణం ఎక్కుపెడుతున్న చరిత్

గూడూరుకు చెందిన సుకుమార్, అరుణకుమారి దంపతుల కుమారుడు కేసర్ల చరిత్ 8వ తరగతి చదువుతున్నాడు. చిన్నతనంలో అల్లూరి సీతారామరాజు చరిత్రను చదివి ఆయనలాగే గురితప్పకుండా బాణాలు వేయాలని భావించాడు. గూడూరులోని అర్జున ఆర్చరీ అకాడమీలో చేరాడు. గురి తప్పకుండా బాణాలు వేయడం నేర్చుకున్నాడు. 2020లో సిల్వర్ మెడల్, 2022లో కర్ణాటకలో 5వ జాతీయ పోటీల్లో పాల్గొని గోల్డ్ మెడల్ పొందాడు. 2023లో హైదరాబాద్‌లో 21వ జాతీయ ఓపెన్ కరాటేలో పోటీల్లో కుమితే విభాగంలో గోల్డ్ మెడల్, 2024లో 29 ఆల్ ఇండియా కరాటేలో కటా విభాగంలో సిల్వర్ మెడల్ సాధించాడు. బంగారు పతకం సాధించాలన్నదే లక్ష్యమని చెప్పాడు.

పట్టుపడితే పతకం రావాల్సిందే..



సురేంద్రవర్మ

కావలి సమీపంలోని బైలేటివారిపాళెంకు చెందిన ఆత్మకూరు సువర్ణబాబు, సుప్రియ దంపతుల కుమారుడు సురేంద్రవర్మ వాకాడులోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. విద్యతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతున్నాడు. సురేంద్రవర్మకు రెజ్లింగ్ అంటే మక్కువ. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో రెజ్లింగ్‌లో మెళకువలు నేర్చుకున్నాడు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచాడు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించాడు. ప్రస్తుతం జాతీయ స్థాయిలో రాణించి గోల్డ్ మెడల్ కొట్టడమే తమ లక్ష్యమని సురేంద్రవర్మ అంటున్నాడు. ఈ విద్యార్థి తల్లిదండ్రులు రోజు వారి కూలీలు. తల్లిదండ్రుల నుంచి ప్రోత్సాహం లేకున్నా స్వశక్తితో క్రీడల్లో రాణిస్తూ అందరి మన్ననలు అందుకుంటున్నాడు.

చిచ్చర పిడుగులు



నాట్య మయూరి సుహర్షిణి



కరాటేలో ప్రతిభ చూపుతున్న సుహర్షిణి

గూడూరుకు చెందిన వెంకయ్య, మల్లిక దంపతుల కుమార్తె పిండి సుహర్షిణి 9వ తరగతి చదువుతోంది. ఆమె నృత్యంలో రాణిస్తోంది. తండ్రి రైల్వేలో పనిచేస్తున్నారు. తల్లి నాట్య కళాకారిణి. ఈ చిన్నారికి చిన్నతనం నుంచే తల్లి చేస్తున్న నృత్యాలు చూసి తాను కూడా నాట్యం నేర్చుకోవాలని మక్కువ కలిగింది. నృత్యం నేర్చుకుంది. పలు ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇవ్వడం మొదలుపెట్టింది. శివనంది, నాట్య మయూరి, నాట్య కిరీటి, గరుడ, నాట్యసిరి, నాట్యప్రభ, నాట్య దీపిక, నాట్య గౌరవ, నటరాజశ్రీ నేషనల్ అవార్డు ఇండియన్ ఐకాన్ స్టార్ ఐకాన్ కిడ్స్ అచీవ్‌మెంట్ అవార్డులు అందుకుంది. వయోలిన్ వాయించడం, పాటలు పాడడం చేస్తోంది. కరాటేలో 6 బెల్టులు సాధించింది. ప్రస్తుతం ప్రపుల్ కలర్ బెల్టు కోసం ప్రయత్నిస్తోంది.

కుస్తీలో గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన నందకిషోర్

గూడూరు మండలం కాంద్రకు చెందిన అల్లెయ్య, వెంకటరమణమ్మ దంపతుల కుమారుడు నన్నూరు నందకిషోర్ చిల్లకూరు గురుకుల పాఠశాలలో ఇంటర్ చదువుతున్నాను. చిన్నతనం నుంచి కుస్తీ పోటీలంటే ఇష్టం. పీడీ శ్రీరేష్ ప్రోత్సాహంతో 2022–23 లో కుస్తీ (రెజ్లింగ్‌లో గ్రీకో రోమన్) జాతీయ స్థాయి పోటీల్లో బ్రాంజ్ మెడల్ సాధించాడు. 2023–24లో విజయవాడలోని నున్న లో జరిగిన జాతీయ స్థాయి కుస్తీ పోటీల్లో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. పలు క్రీడా పోటీల్లోనూ విజేతగా నిలిచాడు.

బహుముఖ ప్రజ్ఞాశాలి లక్ష్మీప్రసన్న



లక్ష్మీప్రసన్న ఆకుపై వేసిన చిత్రం

సైదాపురం మండలం ఊటుకూరుకు చెందిన దొడ్లవరం శివకుమార్, కుమార్తె లక్ష్మీప్రసన్న ఊటుకూరు ఉన్నత పాఠశాలలో చదువుకుంది. విద్యతో పాటు లీఫ్ ఆర్ట్‌తోపాటు ఆర్చరీ, తైక్వాండో, స్విమ్మింగ్, స్కేటింగ్, స్కిప్పింగ్, భరత నాట్యం, కరాటే, యోగా పోటీల్లో రాణిస్తోంది. ఎఫ్ఎక్స్ ఎస్‌టీఈఎన్‌సీఐఎల్ అనే యాప్ ద్వారా పలు ప్రయోగాలు చేస్తోంది. తాను గీయాలనుకున్న చిత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకుని జెల్ పెన్నుతో ఆ చిత్రాన్ని గీచి పెన్ను బ్లేడ్ సహాయంతో బొమ్మలు తయారు చేస్తోంది. పలు రంగాల్లో అసాధారణ ప్రతిభ చూపుతూ పతకాలు సొంతం చేసుకుంది. స్థానికుల నుంచి అభినందనలు అందుకుంటోంది. ఆమె రావి ఆకుపై చిత్రాన్ని గీచి భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్ముకు అభినందనలు తెలిపింది.



పతకాలతో లక్ష్మీప్రసన్న

మట్టిలో మాణిక్యం



బహుమతులు అందుకుంటున్న ఐశ్వర్య

సైదాపురంలోని గోగినేని వెంకటసుబ్బానాయుడు ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న దండిగం ఐశ్వర్య క్రీడల్లో రాణిస్తోంది. ఇటీవల ఏలూరు జిల్లా చింతలపూడిలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో టెన్నికాయిట్‌లో ప్రతిభ చూపింది. లాంగ్ జంప్‌లో మొదటి స్థానంలో నిలిచింది. క్రీడల్లో ఆమెకు ఉన్న మక్కువను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. బంగారు పతకం సాధించడమే తన లక్ష్యమని ఐశ్వర్య చెబుతోంది.

హకీలో యశ్వంత్ ప్రతిభ

గూడూరు చర్చి వీధికి చెందిన ఆటో డ్రైవర్ సురేష్, సంతోషమ్మ కుమారుడు దేవతా యశ్వంత్ హకీలో రాణిస్తున్నాడు. విశాఖపట్టణంలోని స్పోర్ట్స్ హాస్టల్‌లో సీటు సాధించి అక్కడే పదో తరగతి వరకు చదువుకున్నాడు. ఈ ఏడాది జాతీయ స్థాయిలో జరిగిన హాకీ పోటీల్లో సబ్ జూనియర్స్ విభాగంగలో చెన్నైలో జరిగిన సౌత్ జోన్ చాంపియన్‌షిప్‌లో విజయం సాధించాడు. భారత జట్టులో చేరేందుకు కోచ్ దీపక్ ఆకాష్ ద్వారా ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాడు.

హకీలో విజేతగా నిలిచి బహుమతి అందుకుంటున్న యశ్వంత్



భారీ వర్షానికి ప్రవహిస్తున్న కాలువలు





దొరవారిసత్రం: ఎస్ఎం అగ్రహారంలో పొలాల్లో నిలిచిన వర్షపు నీళ్లు, దక్కిలిలో భారీ వర్షానికి ప్రవహిస్తున్న వంక

దొరవారిసత్రం/దక్కిలి: దొరవారిసత్రం, దక్కిలి మండలాల్లో రెండు రోజుల నుంచి భారీ వర్షం కురుస్తోంది. దీంతో పలు గ్రామాల్లో సాగునీటి కాలువలు ప్రవహిస్తున్నాయి. పంట పొలాలు వర్షపు నీటితో నిండిపోయాయి. బుధవారం వర్షం ఆగడంతో వివిధ గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనులు చేపట్టారు. దొరవారిసత్రం మండలంలోని కన్నాకాలువ, పాలకాలువ, నెర్రికాలువ నిండుగా ప్రవహిస్తున్నాయి. దీంతో వెదురుపట్టు, తనియాలి, బూదూరు, కుప్పారెడ్డిపాళెం, వేణుంబాకం, నెలబల్లి, నెల్లూరుపల్లి, కొత్తపల్లి, తల్లంపాడు, మొదుగుళపాళెం, బురదమడుగు, వెటగిరిపాళెం, కమ్మకండ్రిగ, బూదూరు తదితర గ్రామాల్లో వరినాట్లు వేసేందుకు రైతులు పొలాలను సిద్ధం చేస్తున్నారు. దక్కిలి మండలంలోనూ పలు గ్రామాల్లో వాగులు, వంకలు ప్రవహిస్తున్నాయి. ఈ వర్షం నిమ్మ రైతులకు కొంత ఊరటనిచ్చింది.

పెంచలకోనలో ప్రవహిస్తున్న జలపాతాలు

రాపూరు: మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని జలపాతాలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జలపాతాలను చూసేందుకు జిల్లా నలుమూలల నుంచి పర్యాటకులు తరలివస్తున్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని జలపాతాల వద్దకు వెళుతున్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు

దక్కిలి: ఉపాధి హామీ పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని తిరుపతి జిల్లా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ హెచ్చరించారు. ఆయన బుధవారం దక్కిలి మండలంలోని నాగవోలు, లింగసముద్రం, చాకలపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద చేస్తున్న సీసీ రోడ్లు, పశువుల షెడ్ల నిర్మాణ పనులు, నిమ్మ తోటలను పరిశీలించారు. మొక్కలను బాగా సంరక్షించుకుని ఆర్థికంగా లాభం పడాలని రైతులకు సూచించారు. అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామాల్లో కూలీలకు అవసరమైన పనులను చేపట్టాలన్నారు. కూలీలకు సకాలంలో వేతనం అందేలా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మీనారాయణ, ఈసీ దామోదర్‌రాజు, టెక్నికల్ అసిస్టెంట్లు గిరి, సరిత పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

బాలాయపల్లి(సైదాపురం): బాలాయపల్లి మండలం అలిమిలి పంచాయతీలో చేపట్టిన సీసీ రోడ్ల పనులను బుధవారం తిరుపతి డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి నిధులు రూ.2.6 కోట్లతో 41 సీసీరోడ్లు, రూ.84.25లక్షలతో పశువుల షెడ్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ హేమంత్‌కుమార్, ఏపీవో మృత్యుంజయ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం రుచిగా ఉండాలి



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

దక్కిలి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పెట్టే మధ్యాహ్న భోజనం రుచికరంగా, శుభ్రంగా ఉండాలని ఎంపీడీవో గుణశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం డి.వడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన్నారు. ప్రతి రోజూ మెనూను అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం విద్యార్థుల హాజరు, రికార్డులను పరిశీలించారు. ఎంఈవో కె.వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జి హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోస్టల్ ఖాతాలతో ప్రయోజనం

కోట: తపాలా శాఖలో ఖాతాలు ఉన్న వారికి అధిక ప్రయోజనాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కోట బ్రాంచి పోస్ట్ మాస్టర్ సుధీర్ తెలిపారు. ఆయన బుధవారం కోటలో విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌పీసీఐలో ఆధార్‌కు లబ్ధిదారుని ఖాతా నంబర్‌ను అనుసంధానం చేసేందుకు పోస్టల్ కార్యాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నామని, సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కింద నగదును డీబీటీ ద్వారా లబ్ధిదారుడి ఖాతాకు జమ చేయాలంటే ఆధార్ కార్డును అనుసంధానం చేయాలన్నారు. కోట మండలంలో నేటికీ అనుసంధానం కాని బ్యాంకు ఖాతాలు రెండు వేల వరకు ఉన్నాయన్నారు. తపాలా శాఖ సిబ్బంది గ్రామాల్లో దీనిపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు.

జోనల్ క్రీడలు వాయిదా

కోట: స్థానిక ఎస్సీ గురుకుల పాఠశాల క్రీడా మైదానంలో గురువారం నుంచి నిర్వహించాల్సిన జోనల్ క్రీడా పోటీలు వర్షాల వల్ల వాయిదా పడినట్లు ప్రిన్సిపాల్ ఎ.వెంకటేశ్వర్లు తెలిపారు. వర్షాలు ఆగిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోటీలు నిర్వహించే తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

పంటల సాగులో మెళకువలతో అధిక దిగుబడి

సైదాపురం: రబీ సీజన్‌లో పంటల సాగులో రైతులు మెళకువలు పాటిస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఏవో హైమావతి తెలిపారు. మండలంలోని చాగణం రైతు భరోసా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పంటలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా పంటల నమోదు చేసుకోవాలని సూచించారు. తద్వారా ప్రకృతి విపత్తులతో పంటలు నష్టపోతే పరిహారం అందుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నిమ్మ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని సూచించారు.

సూళ్లూరుపేట నుంచి ఆలయ దర్శిని

సూళ్లూరుపేట: కార్తీక మాసం సందర్భంగా ఈనెల 18, 25 తేదీల్లో సూళ్లూరుపేట నుంచి తిరుపతి జిల్లాలోని ఎనిమిది ఆలయాల సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ కింద ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆ డిపో మేనేజర్ ఎస్ మల్లికార్జున్ తెలిపారు. సురుటుపల్లి పల్లికొండేశ్వరస్వామి, నాగలాపురంలోని వేదనారాయణ స్వామి, కైలాసకోన జలపాతం, శివాలయం, నారాయణవనం కళ్యాణ వేంకటేశ్వరస్వామి, చంద్రగిరి వద్దనున్న ముక్కోటి ఆగస్త్యేశ్వరస్వామి, శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వెంకన్న, కపిలతీర్థం, శ్రీకాళహస్తీశ్వస్వామి ఆలయాల దర్శనకు భక్తులను తీసుకెళతామని తెలిపారు. టికెట్ పెద్దలకు రూ.600, చిన్నపిల్లలకు రూ.200గా నిర్ణయించామని చెప్పారు. 50 మంది గ్రూప్ అయితే వారి గ్రామం నుంచే బస్సులు నడుపుతామని, లేదంటే సూళ్లూరుపేట ఆర్టీసీ బస్టాండ్ నుంచి తెల్లవారుజామున 5 గంటలకు బస్సు బయలుదేరి రాత్రి 8 గంటలకు సూళ్లూరుపేట బస్టాండ్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు.

సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

పెళ్లకూరు: అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామాల అభివృద్ధికి రూపొందించాల్సిన ప్రణాళికపై పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో మంజూరయ్యే నిధులను సక్రమంగా వినియోగించుకుని గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలన్నారు. గ్రామసభలు నిర్వహించి పనులను ఎంపిక చేసుకోవాలన్నారు. సర్పంచులు కృష్ణయ్య, చిత్ర, సురేష్, ఎంపీటీసీలు సురేష్, కుమారస్వామి, ఎంపీడీవో ప్రమీలారాణి, ఏవో ప్రవీణ పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి

నాయుడుపేట టౌన్: ప్రభుత్వం విడుదల చేసిన నిధులతో గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులకు అభివృద్ధి ప్రణాళికలపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో సురేష్‌బాబు, ఈవోఆర్‌పీడీ గోపాల్, ఎంపీఎం ఉమాదేవి పాల్గొన్నారు.

భూసారాన్ని బట్టి పంటల సాగు

దక్కిలి: భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని వెంకటగిరి ఏడీఏ నాగార్జునసాగర్ తెలిపారు. మండలంలోని నడింపల్లి, దందవోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పశుసంవర్ధక ఏడీఏ స్వామి మాట్లాడుతూ పశుగణనలో భాగంగా ప్రతి రైతూ తమకు చెందిన పశువులు, గొర్రెలు, గేదెలు, కోళ్ల వివరాలను తెలియజేయాలని సూచించారు. వ్యవసాయశాఖ అధికారిణి సీహెచ్ విజయభారతి, వీఏఏలు హరి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

10 మద్యం బాటిళ్లు స్వాధీనం

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాళెం వద్ద బుధవారం సాయంత్రం ఇద్దరు బెల్టు షాపుల నిర్వాహకులను అదుపులోకి తీసుకుని పది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నాగరాజు తెలిపారు. గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడి చేసినట్టు పేర్కొన్నారు. నిందితులు బెల్లంకొండ రవి, సజ్జ శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్టు

అన్నానగర్: తిరువొత్తియూర్‌లో మహిళా వ్యాపారిని హత్య చేసిన కూలీని అరెస్టు చేశారు. తిరువొత్తియూర్ తేరడి వడివుడియమ్మన్ ఆలయం సన్నధి వీధిలోని ఫుట్‌పాత్‌పై ఆంధ్రప్రదేశ్‌లోని తడకు చెందిన మారి (55), అతని భార్య గౌరి (50) పండ్లను విక్రయిస్తున్నారు. కొద్దిరోజుల క్రితం అదే ప్రాంతానికి చెందిన శేఖర్ (50)తో గౌరికి గొడవ జరిగింది. దీంతో గౌరి బుధవారం దుకాణంలో వ్యాపారం చేస్తుండగా.. అక్కడికి వచ్చిన శేఖర్ పండ్లు కోసే కత్తి తీసుకుని గౌరిని దారుణంగా నరికాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. దీన్ని అడ్డుకునేందుకు వచ్చిన భర్త మారికి కూడా శేఖర్ దాడిలో తీవ్ర గాయాలయ్యాయి.

పేపర్ ప్లేట్ల పరిశ్రమలో అగ్నిప్రమాదం

నాయుడుపేటటౌన్: మండలంలోని తిమ్మాజికండ్రిగ సమీపంలో పేపర్ ప్లేట్‌ల పరిశ్రమలో బుధవారం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగింది. దివ్యాంగురాలైన కృష్ణవేణి అమ్మ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో దాతల సహకారంతో పేపర్ ప్లేట్ల పరిశ్రమ నడుపుతోంది. బుధవారం మధ్యాహ్నం పరిశ్రమలో ఎవరు లేని సమయంలో షార్ట్ సర్క్యూట్ సంభవించింది. అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే వస్తువులు కాలిపోయాయి. సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు కృష్ణవేణి కన్నీటి పర్యాంతమయ్యారు.